క్లుప్తంగా

అక్రమంగా మొరం తవ్విన ప్రాంతం పరిశీలన



గాంధారి(ఎల్లారెడ్డి): మండల పరిధిలోని గుడిమెట్ శివారులో గల మహాదేవుని గుట్ట నుంచి అక్రమంగా మొరం తరలించినట్లు ఫిర్యాదులు రావడంతో శనివారం మొరం తవ్విన ప్రాంతాన్ని డీటీ లక్ష్మణ్ పరిశీలించారు. తహసీల్దార్ రేణుకా చౌహాన్ ఆదేశాల మేరకు ఏఆర్ఐ చంద్రబాను, సర్వేయర్ రాకేశ్‌తో కలిసి సందర్శించారు.

సర్వాపూర్‌లో వరి పొలాలు..

గాంధారి(ఎల్లారెడ్డి): సర్వాపూర్ గ్రామ శివారులో శనివారం క్షేత్ర స్థాయిలో వరి పొలాలను ఏవో రాజలింగం పరిశీలించారు. వరి పైరును చీడపీడలు ఆశించినట్లు గుర్తించి సంబంధిత రైతులకు సస్యరక్షణ చర్యల గురించి తెలిపారు. ఆయనతో పాటు ఏఈవోలు, రైతులున్నారు.

నిరుపేద కుటుంబాలకు ఆర్థిక సహాయం



లింగంపేట(ఎల్లారెడ్డి): పోలాయిపల్లికి చెందిన నిరుపేద కుటుంబాలకు అదే గ్రామానికి చెందిన యువకులు ఆర్థిక సహాయం శనివారం అందజేశారు. ఇటీవల గ్రామానికి చెందిన గన్నారం చిన్నసాయిలు అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న యువకులు మృతుని భార్యకు రూ.24 వేల ఆర్థిక సహాయం అందజేశారు. అలాగే గ్రామానికి చెందిన ఒడ్డె రాములు అనారోగ్యంతో కొన్ని నెలల క్రితం మృతి చెందాడు. మృతుడి తల్లికి రూ.24 వేలు అందజేశారు. గ్రామానికి చెందిన పలువురు యువకులు కలిసి కొంత డబ్బును పోగు చేసుకొని గ్రామ పెద్దల సహకారంతో నిరుపేద కుటుంబాలకు ఆర్థిక సహాయం చేస్తూ అండగా ఉంటూ ఆదర్శంగా నిలుస్తున్నారు. గ్రామస్తుల మన్ననలు పొందుతున్నారు.

వైకుంఠ ధామంలో పిచ్చి మొక్కల తొలగింపు



సాక్షి ఎఫెక్ట్

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో నిర్మించిన వైకుంఠధామాల్లో నెలకొన్న సమస్యలను ఎత్తి చూపుతూ ఈ నెల 19న సాక్షిలో 'వైకుంఠధామాల్లో సౌకర్యాలు కరువు' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. సదాశివనగర్ మండల కేంద్రంలో పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్ వైకుంఠ ధామంలో పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు సమస్యను ఎత్తి చూపి పరిష్కారానికి కృషి చేసిన సాక్షికి కృతజ్ఞతలు తెలిపారు.

కాస్మొటిక్స్ బిల్లులను చెల్లిస్తాం



మద్నూర్(జుక్కల్): గురుకుల పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు కాస్మొటిక్స్ బిల్లులు చెల్లించడం లేదని ఆరోపణలు రావడంతో మండల కేంద్రంలోని బాలుర గురుకుల పాఠశాలలో శనివారం గురుకులాల కో–ఆర్డినేటర్ గంగా శంకర్ తనిఖీ చేశారు. విద్యార్థులకు కాస్మొటిక్స్ బిల్లులు అందించడం లేదని, పాఠశాలలో నాన్ వెజ్ పెట్టడం లేదని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎందుకు చెల్లించలేదని వారు ప్రశ్నించారు. ఇక్కడ బిల్లులు చేసే డాటా ఎంట్రీ ఆపరేటర్‌కు బిల్లులు వేయడం రాకపోవడంతో ఇబ్బందులు జరిగినట్లు ఆయన చెప్పారు. ఈ విషయమై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి విద్యార్థులకు బిల్లులు అందేటట్లు చూస్తానన్నారు. కాస్మెటిక్స్‌కు సంబంధించిన రూ.19 లక్షల బిల్లులు పాఠశాల బ్యాంకు ఖాతాలోనే ఉన్నాయని చెప్పారు.

పకడ్బందీగా నిర్వహించాలి



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): గ్రామాల్లో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహించాలని నాగిరెడ్డిపేట ఎంపీడీవో లలితా కుమారి సూచించారు. పోచారంలో స్వచ్ఛతా హీ సేవలో భాగంగా చేపట్టిన పారిశుద్ధ్య పనులను శనివారం ఎంపీవో ప్రభాకరచారితో కలిసి ఆమె పరిశీలించారు. గ్రామంలో రోడ్లపై చెత్తను పూర్తిగా తొలగింపజేయాలని పంచాయతీ కార్యదర్శి భాస్కర్‌ను ఆమె ఆదేశించారు. షెడ్యూల్ ప్రకారం రోజువారీ కార్యక్రమాలను తప్పకుండా నిర్వహించాలని సూచించారు. అనంతరం ఆత్మకూర్‌లో కొబ్బరి మొక్కల ప్లాంటేషన్‌ను పరిశీలించారు. ఈసీ సాయిలు, జీపీ కార్యదర్శి భాస్కర్, తదితరులున్నారు.



కామారెడ్డిటౌన్: సాందీపని కళాశాలలో నిమజ్జనం చేస్తున్న లెక్చరర్లు, విద్యార్థినులు



ఎల్లారెడ్డి మోడల్ స్కూల్లో బతుకమ్మ ఆడుతూ..



కామారెడ్డి ఆర్ట్స్ కళాశాలలో..



భిక్కనూరులో సిద్దార్థ విద్యాలయంలో..

ఘనంగా బతుకమ్మ సంబురాలు

పాఠశాలలు, కళాశాలల్లో శనివారం బతుకమ్మ సంబురాలను ఘనంగా నిర్వహించారు. దసరా సెలవులు ఆదివారం నుంచి ప్రారంభమవుతున్న సందర్భంగా శనివారమే ముందస్తుగా బతుకమ్మ వేడుకలు చేశారు. విద్యార్థినులు, మహిళా ఉపాధ్యాయులు, అధ్యాపకులతో కలిసి బతుకమ్మలను పేర్చి ఆడి పాడారు. అనంతరం స్థానికంగా ఉన్న కుంటలు, చెరువుల్లో నిమజ్జనం చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



బాన్సువాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బతుకమ్మలతో విద్యార్థులు, ఉపాధ్యాయులు



కృష్ణాజీవాడి పాఠశాలలో..



అచ్చంపేట మోడల్ పాఠశాలలో..



వడ్లం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో..



దోమకొండలోని త్రివేణి పాఠశాలలో ..



చిన్నూర్ పాఠశాలలో..



మహమ్మద్ నగర్ మంజీరా పాఠశాలలో..



పిట్లం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ..



వదల్‌పర్తిలో బతుకమ్మలను నిమజ్జనం చేస్తూ..



మేనూర్ మోడల్ స్కూల్‌లో..



మద్నూర్ డిగ్రీ కళాశాలలో..



అంబారీపేట ప్రభుత్వ పాఠశాలలో ..



సజ్జన్‌పల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో..



లింగంపేట బాలుర ఉన్నత పాఠశాలలో బతుకమ్మ పేరుస్తున్న ఉపాధ్యాయులు



బోర్లం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో..



బాన్సువాడ ప్రభుత్వ డిగ్రీ కళాలలో..



బతుకమ్మతో చిన్నారి స్వేచ్ఛ



పెద్దకొడప్‌గల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ..



రాజంపేటలోని శారద శిశుమందిర్ పాఠశాలలో ..



కామారెడ్డిరూరల్: దేవునిపల్లి జెడ్పీ హెచ్ఎస్‌లో..

గోతి ఉంది జాగ్రత్త!



ఎంపీడీవో కార్యాలయం వద్ద రోడ్డు మధ్యలో ఏర్పడిన గోతి

బిచ్కుంద(జుక్కల్): మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం వద్ద కందర్‌పల్లి రోడ్డులో కల్వర్టు కూలిపోయి పెద్ద గుంత ఏర్పడింది. దెగ్లూర్, పిట్లం, జుక్కల్ వెళ్లడానికి ఆ రోడ్డు గుండా రోజుకు వందల వాహనాలు తిరుగుతుంటాయి. గోతి ఏర్పడి నెల రోజులు అవుతుంది. ఈ రోడ్డు గుండా ఆర్అండ్‌బీ అధికారులు నిత్యం వస్తూపోతున్నారు. అయినా తమకేమీ పట్టనట్లుగా అధికారులు వ్యవహరిస్తున్నారు. గత వారం రోజులలో పదికి పైగా ద్విచక్ర వాహనదారులు గోతి వద్ద పడి గాయాలపాలయ్యారు. గత మంగళవారం మహారాష్ట్రకు చెందిన ఓ వ్యక్తి భార్య, ఇద్దరు చిన్న పిల్లలతో కలిసి ద్విచక్రవాహనంపై వెళ్తూ కూలిన కల్వర్టు గమనించక వాహనం ముందు చక్రం గుంతలో ఇరుక్కొని పడిపోయారు. అందరికీ తీవ్రగాయాలు కావడంతో స్థానిక ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. దీంతో స్థానికులు ఆ గోతి వద్ద చెట్టు కొమ్మను సూచికగా పెట్టారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కల్వర్టు వద్ద ఏర్పడిన గోతిని పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు.

క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలి

- ఐసీడీఎస్ ఇన్‌చార్జి సీడీపీవో స్వరూపారాణి



మాట్లాడుతున్న ఇన్‌చార్జి సీడీపీవో స్వరూపారాణి

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): గర్భిణులు, బాలింతలు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకుంటే శిశువులు ఆరోగ్యంగా, బలంగా ఉంటారని ఐసీడీఎస్ ఇన్‌చార్జి సీడీపీవో స్వరూపారాణి అన్నారు. నాగిరెడ్డిపేట అంగన్‌వాడీకేంద్రంలో శనివారం జరిగిన పోషణ మాసోత్సవ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు ఆకుకూరలు, కూరగాయలు క్రమం తప్పకుండా తినాలన్నారు. దీంతోపాటు అప్పుడే పుట్టిన శిశువులకు తప్పకుండా ముర్రుపాలు తాగించాలని చెప్పారు. చక్కెరకు బదులుగా బెల్లం వినియోగించాలన్నారు. క్రమం తప్పకుండా అంగన్‌వాడీకేంద్రానికి వచ్చి అక్కడ ఇచ్చే పౌష్టికాహారాన్ని తినాలన్నారు. కార్యక్రమంలో ఏసీడీపీవో ప్రసన్న, సూపర్‌వైజర్ భారతి, పంచాయతీ కార్యదర్శి కార్తీక్, అంగన్‌వాడీ టీచర్లు సస్యశ్రీ, నవనీత తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కులపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న మోహన్

లింగంపేట(ఎల్లారెడ్డి): శెట్పల్లి ఉన్నత పాఠశాలలో శనివారం బాలల హక్కులపై కామారెడ్డి బాలరక్ష భవన్‌కు చెందిన సామాజిక కార్యకర్త మోహన్, ఔట్రిచ్ వర్కర్ సూర్యప్రకాష్ అవగాహన కల్పించారు. బాలల సంరక్షణ చట్టాలు, బాలలపై లైంగిక వేధింపుల నివారణ చట్టం, బాల్య వివాహాల నిర్మూలన చట్టం, బాల కార్మిక, బాలల రక్షణ చట్టాల గురించి వివరించారు. బాలలకు ఇబ్బందులు కలిగించిన, బాల్య వివాహాలు చేసినా, ఏమైనా సమస్యలు ఉంటే టోల్ ఫ్రీ నంబర్ 1098కు కాల్ చేయాలన్నారు. అలాగే పాఠశాల స్థాయిలో చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. తల్లిదండ్రులు లేని పిల్లలకు మిషన్ వాత్సల్య పథకం కింద నెలకు రూ.4 వేల ఆర్థిక సహాయం అందజేయనున్నట్లు తెలిపారు.

కాంగ్రెస్ పార్టీలో చేరికలు



నిజాంసాగర్(జుక్కల్): పెద్దకొడప్‌గల్ మండలం బాబుల్‌గావ్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకులు శనివారం హైదరాబాద్‌లో జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు, ఎమ్మెల్యే చేపడుతున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు వారు చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కృషి చేస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే కండువాలు కప్పి స్వాగతం పలికారు.

పంటనష్ట పరిహారం అందేలా కృషి



నిజాంసాగర్(జుక్కల్): ఇటీవల కురిసిన వర్షాలు, వరద ప్రవాహాల కారణంగా పంట నష్టానికి గురైన రైతులకు నష్ట పరిహారం అందేలా రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తానని మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు భరోసా ఇచ్చారని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు. శనివారం మంత్రిని ఎమ్మెల్యే కలిశారు. పంట నష్టంపై మంత్రికి వివరించారు. ఎమ్మెల్యే వెంట ఎన్ఆర్ఐ భుజంగారి భాస్కర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

పెన్షన్‌పై ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి



భిక్కనూర్ జీపీ ముందు నిరసన తెలుపుతున్న వృద్ధులు, వికలాంగులు



అక్కాపూర్‌లో..

ఎల్లారెడ్డిరూరల్/మాచారెడ్డి: పెన్షన్‌పై కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని ఎమ్మార్పీఎస్ నేతలు అన్నారు. శనివారం ఎల్లారెడ్డి మండలం భిక్కనూరులో, మాచారెడ్డి మండలం అక్కాపూర్‌లో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో వృద్ధులు, వికలాంగులతో కలిసి ధర్నాలు చేపట్టారు. పంచాయతీ కార్యదర్శులకు వినతిపత్రాలు అందజేశారు. అనంతరం నేతలు మాట్లాడుతూ..కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే వృద్ధులకు రూ.4 వేలు, వికలాంగులకు రూ.6 వేల పెన్షన్ ఇస్తామని హామీ ఇచ్చిందని, అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర గడుస్తున్నా ఇంతవరకు పెన్షన్లు పెంచక పోవడం సరికాదన్నారు.

మహిళాసంఘాల ఆర్థికాభివృద్ధికి కృషి చేయాలి



మాట్లాడుతున్న ఏపీఎం రాంనారాయణగౌడ్

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మహిళా సంఘాల ఆర్థికాభివృద్ధికి గ్రామసంఘాల ప్రతినిధులు కృషి చేయాలని నాగిరెడ్డిపేట ఐకేపీ ఏపీఎం రాంనారాయణగౌడ్ సూచించారు. నాగిరెడ్డిపేట ఐకేపీ కార్యాలయంలో శనివారం గ్రామసంఘాల అధ్యక్షులతో ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. మహిళాసంఘాల సభ్యులు ఇదివరకు తీసుకున్న రుణాలను వసూలు చేయించి కొత్త రుణాలను ఇప్పించాలన్నారు. దీంతోపాటు గ్రామాల్లో ఉల్లాస్ ద్వారా మహిళలను అక్షరాస్యులుగా మార్చాలన్నారు. బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి రుణలక్ష్యం నెరవేర్చేందుకు గ్రామ సంఘాల ప్రతినిధులు సహకరించాలని కోరారు. సమావేశంలో మండల సమాఖ్య అధ్యక్షులు బేస్త శాంత, కోశాధికారి మమత, సీసీలు నారాయణ, రషీద్, నజీర్, రమేష్, సావిత్రి, అకౌటెంట్ రాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ పునరుద్ధరణ గాలికి..



హౌసింగ్ బోర్డు కాలనీ వాగు పక్కన నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు

కామారెడ్డి క్రైం: విద్యుత్ సరఫరాను పునరుద్ధరించడంలో అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదలు కామారెడ్డిలోని హౌసింగ్ బోర్డు కాలనీని అతలాకుతలం చేశాయి. వరదలు ముంచెత్తడంతో విద్యుత్ సరఫరాకు సంబంధించిన సదుపాయాలు నేలమట్టం అయ్యాయి. పునరుద్ధరణ పనులు ప్రారంభించిన అధికారులు కొన్ని చోట్ల మాత్రమే పనులు చేపట్టి మరికొన్నింటిని గాలికి వదిలేస్తున్నారనే ఆరోపణలు చోటు చేసుకుంటున్నాయి. వరద, చెరువు నీరు కలిసి ఉధృతంగా ప్రవహించిన వాగు పక్కన ప్రధాన రహదారి వెంబడి విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. ఈ ప్రాంతంలోని నివాస గృహాలు, దుకాణాల్లో అంధకారం నెలకొంది. దాదాపు 20 రోజులు కావస్తున్నా ఇక్కడ విద్యుత్ పునరుద్ధరణ పనులు చేపట్టడం లేదని స్థానికులు వాపోతున్నారు. అధికారులు వెంటనే స్పందించి స్తంభాలు, తీగలు ఏర్పాటు చేయాలని, విద్యుత్ సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.

సంక్షిప్తం

కబ్జాను తొలిగించాలని వినతి



కామారెడ్డి అర్బన్: భిక్కనూర్ గ్రామ పంచాయతీ ఎదురుగా అక్రమంగా నిర్మించిన షెడ్‌ను వెంటనే తొలగించాలని గ్రామానికి చెందిన పి.జ్ఞానప్రకాష్‌రెడ్డి శనివారం జిల్లా పంచాయతీ, డివిజనల్ పంచాయతీ అధికారులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. మూడు నెలలుగా అక్రమ షెడ్‌లను తొలిగించాలని భిక్కనూర్ గ్రామ పెద్దమనుషులు చెప్పినా గ్రామ పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని, తాను స్వయంగా ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా.. ఈనెల 22లోగా చర్యలు తీసుకోకపోతే మళ్లీ రావాలని సూచించారని జ్ఞానప్రకాష్‌రెడ్డి వివరించారు. బహిరంగ విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు.

పంటల సాగు వివరాలను నమోదు చేయించాలి

భిక్కనూరు: అన్ని గ్రామాల రైతులు తాము సాగు చేస్తున్న పంటల వివరాలను వెంటనే వ్యవసాయ శాఖ సిబ్బందిని కలిసి నమోదు చేయించుకోవాలని భిక్కనూరు ఏఈవో వినోద్‌గౌడ్ తెలిపారు. శనివారం ఆయన భిక్కనూరులో మాట్లాడారు. ప్రభుత్వం రైతులు పండించిన పంటలను మద్దతు ధరకు కొనుగోలు చేస్తుందన్నారు. ఎవరైనా రైతులు తమ పంటల సాగు వివరాలను నమోదు చేయకుంటే వారికి పంటల విక్రయ సమయంలో ఇబ్బందులు కలుగుతాయన్నారు.

విత్తనోత్పత్తి కేంద్రాల సందర్శన



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): వదల్‌పర్తి శివారులో నాణ్యమైన విత్తనం రైతన్నకు నేస్తంలో భాగంగా ఏర్పాటు చేసిన విత్తనోత్పత్తి కేంద్రాలను శనివారం మాల్తుమ్మెదలోని తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త అనిల్‌రెడ్డి, స్థానిక ఏవో సాయికిరణ్ పరిశీలించారు. విత్తనాల ఉత్పత్తిలో పాటించాల్సిన మెలకువలను రైతులకు వారు తెలియజేశారు. దీంతోపాటు చీడపీడల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు.

గేదెల కొనుగోలుపై అవగాహన సదస్సు

కామారెడ్డి రూరల్: పాతరాజంపేట శివారులోని విజయ డెయిరీలో డిప్యూటీ డైరెక్టర్ నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో శనివారం పాల సేకరణ కేంద్రాల అధ్యక్ష, కార్యదర్శులకు పాడి గేదెల కొనుగోలుపై అవగాహన సదస్సును నిర్వహించారు. అందులో భాగంగా పాల ఉత్పత్తిదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు తిరుపతి రెడ్డి మాట్లాడుతూ.. బ్యాంకులు సబ్సిడీపై రూ.5 లక్షల వరకు పర్సనల్ లోన్ ఇవ్వాలని, సకాలంలో అప్లికేషన్ ఫామ్‌ను సూపర్‌వైజర్ ద్వారా పూర్తి చేసి పంపే విధంగా చూడాలని కోరారు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ద్వారా లోన్‌లు, సబ్సిడీ ఇచ్చే విధంగా చూడాలని కోరారు. డిప్యూటి డైరెక్టర్ నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ...లోన్ తీసుకునే వారు ముందుకు రావాలని, తీసుకునే వారికి లోన్‌లు, సబ్సిడీ ఇస్తామన్నారు. దానాను సకాలంలో తెప్పించి అందే విధంగా చూస్తానని తెలిపారు. అనంతరం కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌ను కలిశారు.